సాక్షి మెదక్

శనివారం । 7 । అక్టోబర్ । 2023



వలస మాని.. వలలు పట్టి

గ్రామాల్లో కనుమరుగవుతున్న కులవృత్తులకు పూర్వ వైభవం తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పథకాలకు శ్రీకారం చుట్టి విజయవంతంగా అమలుచేస్తోంది. వివరాలు 8లో ▸



ఓటుహక్కు వినియోగించుకోవాలి

ఓటుహక్కు వినియోగంపై కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మాక్ పోలింగ్ నిర్వహించి విద్యార్థులకు ఓటు విలువ తెలియజేశారు. వివరాలు 9లో ▸

నేడు జువైనల్ జస్టిస్ ప్రోగ్రాం

మెదక్ కలెక్టరేట్: మెదక్ జిల్లా కోర్టు ప్రాంగణంలో జువైనల్ జస్టిస్ బోర్డు సెన్సిటైజేషన్ ప్రోగ్రాం శనివారం నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీ శారద శుక్రవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని తదితరులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

కదం తొక్కిన ఆశా వర్కర్లు

పట్టణంలో భారీ నిరసన ర్యాలీ



మెదక్‌లో రాస్తారోకో చేస్తున్న ఆశా వర్కర్లు

మెదక్ కలెక్టరేట్: ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆశా వర్కర్లు జిల్లా కేంద్రం మెదక్‌లో శుక్రవారం భారీ నిరసన ర్యాలీ తీశారు. ఆర్టీసీ బస్సు డిపో వద్ద రాస్తారోకో నిర్వహించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వీరికి సంఘీభావం తెలిపిన సీఐటీయూ జిల్లా కార్యదర్శి బస్వరాజ్ మాట్లాడుతూ ఆశా వర్కర్లు తమ సమస్యలు పరిష్కరించాలని 13 రోజులుగా శాంతియుతంగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. ఇటీవల మెదక్ పర్యటన సందర్భంగా మంత్రి హరీశ్‌రావును కలిసి ఆశా వర్కర్లు తమకు గౌరవ వేతనం కాకుండా ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని అడిగితే ఏ రాష్ట్రంలో లేని వేతనాలు మన రాష్ట్రంలోనే ఇస్తున్నామని చెప్పడం దారుణమన్నారు. అంగన్ వాడీలతో చర్చలు జరిపినట్లుగా ఆశా వర్కర్ల సమస్యలపై యూనియన్ నాయకులతో ప్రభుత్వం చర్చలు జరిపి వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ అధ్యక్షురాలు సావిత్రి, ఆశా వర్కర్లు మంజుల, స్వప్న, స్వరూప, పద్మ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

బీవీఆర్ఐటీ ప్రొఫెసర్‌కు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న ప్రొఫెసర్

నర్సాపూర్: నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ కాలేజీ ప్రొఫెసర్ గణేష్ నాయుడు డాక్టరేట్ పొందారు. ఈయన తమిళనాడులోని అన్నామలై యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఆర్.తిరువెంకటనాథన్ మార్గదర్శకత్వంలో ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ క్యారెక్టర్ రికగ్నేషన్ యూజింగ్ మిషన్ లెర్నింగ్ టెక్నిక్స్ అనే అంశంపై పరిశోధన చేశారు. డాక్టరేట్ పొందిన గణేష్ నాయుడును శుక్రవారం కాలేజీ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, ప్రిన్సిపాల్ సంయ్‌దూబె తదితరులు అభినందించారు.

నైపుణ్య శిక్షణ కేంద్రానికి స్థలం కేటాయించాలి

మెదక్ జిల్లా కుమ్మర సంఘం అధ్యక్షుడు బాలకృష్ణ



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కుమ్మరులు

మెదక్ కలెక్టరేట్: జిల్లా కేంద్రమైన మెదక్‌లో వృత్తి నైపుణ్య శిక్షణ, మట్టి పాత్రల తయారీ కోసం రెండు ఎకరాల స్థలం కేటాయించాలని మెదక్ జిల్లా కుమ్మర సంఘం అధ్యక్షుడు బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి శంకరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో మెదక్‌లో కలెక్టర్ రాజర్షి షా, మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డిలను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో కుమ్మర కులస్తులకు వృత్తి నైపుణ్య శిక్షణ, మట్టి పాత్రల తయారీ కోసం రెండు ఎకరాల స్థలం కేటాయించాలన్నారు. అలాగే కుమ్మర కులస్తుల వృత్తి శిక్షణ భవనం నిర్మించి, విద్యుత్ యంత్రాలను ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో పాపన్నపేట సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కుమ్మరి జగన్, జిల్లా కోశాధికారి మల్లేష్, ఉపాధ్యక్షుడు గోపాల్, జిల్లా కుమ్మర కులస్తులు యాదగిరి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద బస్తీ దవాఖానా

మెదక్ మున్సిపాలిటీ: ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి చందునాయక్ సూచించారు. మంత్రి హరీశ్‌రావు ఆదేశాల మేరకు శుక్రవారం ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మెదక్‌లోని పిల్లికొట్టాల్ డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద బస్తీ దవాఖానాను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య అధికారి మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం నిర్మించిన ఈ ఆస్పత్రిలో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, ఇతరులు వైద్య సేవలు పొందొచ్చన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, నాయకులు పాల్గొన్నారు.

కోడ్ కూయకముందే!

ప్రచారంలో బీఆర్ఎస్ దూకుడు

- శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో మంత్రి హరీశ్‌రావు బిజీ
- బహిరంగ సభల్లో ప్రత్యర్థులపై మాటల తూటలు
- కానరాని ప్రతిపక్షాల ప్రచారం



రామాయంపేటలో బహిరంగ సభలో పాల్గొన్న మంత్రి హరీశ్‌రావు

మెదక్: శాసనసభ ఎన్నికల గడువు దగ్గర పడుతుండటంతో అధికార బీఆర్ఎస్ పార్టీ వేగం పెంచింది. ఎన్నికల కోడ్ ప్రకటించకున్నా.. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, నూతన పనులకు శంకుస్థాపనలతో హడావుడి చేస్తున్నారు. జిల్లాలో మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాలు ఉండగా.. ఇప్పటికే మెదక్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికి టికెట్ కేటాయించగా, నర్సాపూర్ టికెట్ మాత్రం సందిగ్ధంలో ఉంది. కాంగ్రెస్, బీజేపీ తమ అభ్యర్థులను ప్రకటించ లేదు. అయితే బీఆర్ఎస్ ప్రచారంలో దూసుకుపోతోంది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, బీఆర్ఎస్ ముఖ్యనేతలు విస్తృతంగా పర్యటిస్తున్నారు. ప్రతిచోట బహిరంగ సభ నిర్వహిస్తూ ప్రచారాన్ని పూర్తిచేసే పనిలో నిమగ్నమయ్యారు. ఎన్నికల షెడ్యూల్ వస్తే అధికార పార్టీ చేయాలనుకున్న పనులకు బ్రేక్‌లు పడతాయి. అందుకే షెడ్యూల్ రాకముందే వేగం పెంచింది. కాగా నర్సాపూర్ అభ్యర్థిని ఇంకా ఖరారు చేయకపోవడంతో అక్కడ బీఆర్ఎస్ శ్రేణులు టికెట్ ఎవరికి వస్తోందనని కాస్త డీలాపడగా, మెదక్‌లో మాత్రం కార్యకర్తలు క్షణం తీరిక లేకుండా నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ ఏదో ఒక కార్యక్రమం చేస్తున్నారు.

సభలతో హోరెత్తిస్తున్న హరీశ్

నోటిఫికేషన్ రాకముందే మంత్రి హరీశ్‌రావు బహిరంగ సభలతో హోరెత్తిస్తున్నారు. పదునైన మాటలతో ప్రత్యర్థులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. కార్యకర్తలను ఎన్నికలకు సమాయత్తం చేస్తున్నారు. గత నెల 27న హరీశ్‌రావు గజ్వేల్ నియోజవర్గం పరిధిలోని మనోహరాబాద్‌లో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. మెదక్‌లో గ్రంథాలయ భవనం, సఖీ కేంద్రాలు, తూప్రాన్‌లో అభివృద్ధి పనులు, మెదక్ నియోజకవర్గంలోని నిజాంపేటలో పార్టీ కార్యాలయం, రామాయంపేటలో ప్రభుత్వ కార్యాలయం, డిగ్రీ కళాశాలను ప్రారంభించారు. 5న మెదక్‌లో ఎరుకల సాధికారత పేరిట రాష్ట్ర పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సభలు ఏర్పాటు చేసి తమ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమం గురించి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

జోరుగా తాయిలాల పంపిణీ

రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయాన్ని సొంతం చేసుకునే దిశగా ముఖ్య నేతలు పావులు కదుపుతున్నారు. ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు అడిగిన పనుల్లో కొన్నింటినైనా చేస్తున్నారన్న టాక్ వినిపిస్తోంది. పార్టీ కోసం పనిచేస్తున్న వారిని గుర్తించి వారికి దళిత, బీసీ, మైనార్టీ బంధు, గృహలక్ష్మి పథకాలను అందేలా చూస్తున్నారు. ఎన్నికల్లో ఏ ఒక్కరూ చేజారిపోకుండా ఉండేందుకు బీఆర్ఎస్ నేతలు ఏదో ఒకరకంగా మేలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. కార్యకర్తలు కాంగ్రెస్, బీజేపీ వైపు వెళ్లకుండా జాగ్రత్తపడుతున్నారు. కొందరికి స్థాయిని బట్టి డబ్బు సాయం కూడా చేస్తున్నట్లు తెలిసింది.

బీఆర్ఎస్‌లో సముచిత స్థానం అంటూ..

డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి టికెట్ ఆశించి భంగపడి కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. ఆయనతో పాటు మరికొందరు పార్టీని వీడారు. కాగా హైదరాబాద్‌లో ఉండే తిరుపతిరెడ్డికి ఇంటికి మంత్రి హరీశ్‌రావు వెళ్లి బీఆర్ఎస్‌లో చేరాలని, రాబోయే రోజుల్లో పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఆయనతో పాటు కాంగ్రెస్‌లోని అసమ్మతివాదులకు మంత్రి కేసీఆర్ స్వయంగా ఫోన్లు చేసి పార్టీలోకి ఆహ్వానిస్తూ ప్రచారంలో దూసుకుపోతున్నారు.

అల్పాహారం విద్యార్థులకు వరం

ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: అల్పాహార పథకం విద్యార్థులకు వరమని మెదక్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని శుక్రవారం మెదక్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ మదిలో పుట్టిన పథకం అల్పాహార పథకమన్నారు. దశలవారీగా ప్రతీ పాఠశాలలో ప్రారంభమవుతుందని తెలిపారు. తెలంగాణ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం పనిచేస్తున్నారన్నారు. పట్టణంలో ప్రభుత్వ పాఠశాల, మైనార్టీ సోషల్ వెల్ఫేర్ స్కూల్స్, రెసిడెన్షియల్ స్కూల్స్, అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం కింద సన్న బియ్యంతో విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షి షా, మున్సిపల్ చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్ గుప్తా, వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, ఏఎంసీ చైర్మన్ బట్టి జగపతి, కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

పాపన్నపేట(మెదక్): తెలంగాణలో ఆలయాల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. ఏడుపాయల్లో నిర్వహించనున్న దేవీ శరన్నవరాత్రోత్సవాల వాల్ పోస్టర్‌ను శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్ విడుదల చేసిన రూ.100 కోట్లతో ఏడుపాయల రూపురేఖలు మారిపోతాయన్నారు. మాస్టర్ ప్లాన్‌తో ఏడుపాయల మరో యాదాద్రిగా మారుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాలాగౌడ్, ఈఓ మోహన్ రెడ్డి, మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, ఏఎంసీ చైర్మన్ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులతో అల్పాహారం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, కలెక్టర్ రాజర్షి షా

మున్సిపల్ చైర్మన్‌లకు పదవీ గండం!

అవిశ్వాస తీర్మానాల ప్రక్రియ కొనసాగించాలని హైకోర్టు ఆదేశాలు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: జిల్లాలోని పలు మున్సిపాలిటీల చైర్మన్లకు పదవీ గండం పొంచి ఉంది. తమపై పెట్టిన అవిశ్వాస తీర్మానాలను కొట్టివేయాలని పలువురు చైర్మన్లు వేసిన పిటిషన్లను విచారించిన హైకోర్టు.. తీర్మానాల ప్రక్రియను కొనసాగించాలని తీర్పు ఇచ్చింది. జిల్లాలోని సంగారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ బొంగుల విజయలక్ష్మి, సదాశివపేట మున్సిపల్ చైర్ పర్సన్ పిల్లోడి జయమ్మ, అందోల్ మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య, మెదక్ జిల్లా నరసాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళి యాదవులపై సొంత పార్టీ కౌన్సిలర్లే అవిశ్వాస తీర్మానం నోటీసులు జిల్లా కలెక్టర్లకు అందజేసిన విషయం విదితమే. తాజాగా కోర్టు ఇచ్చిన ఆదేశాలతో ఈ అవిశ్వాస తీర్మానాల ప్రక్రియ కొనసాగనుంది. దీంతో ఈ మున్సిపాలిటీల చైర్మన్లు తమ బలాన్ని నిరూపించుకోని పక్షంలో పదవి నుంచి వైదొలగాల్సిన పరిస్థితి ఏర్పడనుంది.

సమష్టి పోరుతోనే రాజ్యాధికారం

తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి స్వామి ముదిరాజ్



శంకుస్థాపన చేస్తున్న స్వామి ముదిరాజ్

కౌడిపల్లి(నర్సాపూర్): ముదిరాజ్‌లు ఐకమత్యంగా ఉంటూ పోరాడితే రాజ్యాధికారం దక్కుతుందని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి గుమ్ముల స్వామి ముదిరాజ్ అన్నారు. శుక్రవారం మండలంలోని రాజిపేటలో ముదిరాజ్ సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ కలిసి కట్టుగా పోరాడితే అధికారం లభిస్తుందన్నారు. అప్పుడే మన సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ లింగంగౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ మల్లేష్ యాదవ్, రాజిపేట ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా బీసీబంధు సాయం

ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి
మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీతారెడ్డి



నర్సాపూర్‌లో బీసీ బంధు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మదన్ రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీతారెడ్డి

నర్సాపూర్: కులవృత్తులపై ఆధారపడిన కుటుంబాలను ఆదుకునేందుకే బీసీ బంధును సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బీసీ బంధు లబ్ధిదారుల చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎంపిక చేయని కుటుంబాలను దశలవారీగా ఎంపిక చేసి ఆర్థిక సహాయం అందచేస్తారని, ఎవరూ నిరుత్సాహ పడొద్దన్నారు. త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికలలో బీఆర్ఎస్ విజయం సాధించి కేసీఆర్ మూడోసారి సీఎం అవుతారని జోస్యం చెప్పారు. కాగా నర్సాపూర్ నియోజకవర్గంలో దళిత బంధు పథకం పకడ్బందీగా అమలు చేస్తున్నారని గురువారం తాను సీఎం కేసీఆర్‌ను కలిసిన సందర్భంగా చెప్పడంతో ఆయన సంతోషం వ్యక్తం చేశారని తెలిపారు. అనంతరం రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని 28 వేల ప్రభుత్వ పాఠశాలల్లోని 2.70 లక్షల మంది విద్యార్థులకు అల్పాహారం అందజేసే మరో గొప్ప పథకాన్ని సీఎం శుక్రవారం ప్రారంభించారన్నారు. కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ అల్పాహారం పథకం మంచి కార్యక్రమమని, జిల్లాలో రెండు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో అసంఘటిత కార్మిక బోర్డు చైర్మన్ దేవేందర్‌రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ రమేష్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, జెడ్పీ కో ఆప్షన్ మెంబర్ మన్సూర్, ఆత్మ కమిటీ చైర్మన్ గొర్రె వెంకట్‌రెడ్డి, ఆర్‌డీఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఫైర్‌స్టేషన్ ప్రారంభం

నర్సాపూర్ ఫైర్ స్టేషన్‌ను శుక్రవారం రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డితో కలిసి ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫైర్ సిబ్బంది తమ ప్రాణాలను లెక్కచేయకుండా ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడతారన్నారు. ఫైర్ స్టేషన్‌లో వసతుల కల్పనకు తన వంతు కృషిచేస్తానన్నారు.

మీ ప్రేమ, ఆశీర్వాదం కావాలి

సిద్దిపేట ప్రజలే నా కుటుంబసభ్యులు

- ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు



బ్యాడ్మింటన్ ఆడుతున్న మంత్రి హరీశ్ రావు

సిద్దిపేటజోన్: 'సిద్దిపేట ప్రజలే నా కుటుంబసభ్యులు.. ఎక్కడ ఉన్నా మీ గురించే ఆలోచన చేస్తుంటా.. ఇక్కడికి వస్తేనే తృప్తిగా ఉంటుంది.. ప్రజల సంక్షేమం కోసం నిరంతరం తపన.. ఎల్లప్పుడూ మీ ప్రేమ, ఆశీర్వాదం ఉండాలనే కోరుతుంటా..' అని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక కొండ భూదేవి గార్డెన్‌లో 400 మంది బలహీన వర్గాలకు చెందిన లబ్ధిదారులకు ప్రభుత్వ సాయం రూ.లక్ష చెక్కులను, 400 మందికి గృహ లక్ష్మి ప్రొసీడింగ్ పత్రాలను, చిన్నకోడూరు మండల జర్నలిస్టులకు ఇంటి స్థలాల పట్టాలు, కుల సంఘాలకు భవన నిర్మాణ నిధుల మంజూరు ప్రొసీడింగ్ లను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవుడిచ్చిన శక్తిని మీ సేవ కోసం నిరంతరం ధారపోస్తానని అన్నారు. రోజూ18 గంటల పాటు శ్రమిస్తున్నానని, సిద్దిపేట ప్రజల కోసం రాత్రి పగలు కష్టపడుతునట్లు తెలిపారు. ఒకప్పటి సిద్దిపేటకు ఇప్పుడు చూస్తున్న పట్టణానికి చాలా తేడా ఉందని, ఇదే స్ఫూర్తితో పనిచేస్తానని చెప్పారు. సిద్దిపేట రాష్టానికే రోల్ మోడల్‌గా నిలిచిందని, దేశానికే ఆదర్శంగా ఉందన్నారు. మీరు ఇచ్చిన బలంతో సిద్దిపేట గౌరవాన్ని ఇనుమడింపజేసేలా చేసినట్లు చెప్పారు. అంతకుముందు కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ మాట్లాడుతూ అత్యధికంగా బీసీ రుణాలు అందించి రాష్ట్రంలో సిద్దిపేట జిల్లా మొదటి స్థానంలో నిలిచిందన్నారు.

క్రీడాహబ్ సిద్దిపేట

సిద్దిపేటను అన్ని క్రీడలకు నెలవుగా మార్చి క్రీడా హబ్‌గా చేసుకున్నట్టు మంత్రి హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక స్టేడియంలో ఇండోర్ బాల్ బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్ కోర్టులను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల అభివృద్ధికి ప్రత్యేకంగా రూ.11కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కొద్దిసేపు బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్ ఆడి సందడి చేశారు. అనంతరం వాలీబాల్ అకాడమీ లో అడ్మిషన్లు పొందిన క్రీడాకారులకు పత్రాలు అందచేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్ శ్రీధర్ రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, సుడా చైర్మన్ రవీందర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మంజుల రాజనర్స్ పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

- జిల్లాలో 392 ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- కేంద్రాల ద్వారా రైతులకు మద్దతు ధర
- కలెక్టర్ రాజర్షిషా



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

మెదక్ కలెక్టరేట్: దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని, జిల్లాలో వానాకాలంలో పండిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు 392 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు నిబంధనల ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. రైతులు కూడా ధాన్యాన్ని తప్పనిసరిగా తేమలేకుండా తెచ్చేలా చూడాలన్నారు. 17 శాతం కంటే తక్కువ తేమ ఉండే విధంగా ఎండబెట్టి తీసుకొచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్మి మద్దతు ధర పొందాలన్నారు. ఐకేపీ, సివిల్ సప్లయ్, మార్కెటింగ్, రవాణా శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లా యంత్రాంగం ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా రవాణా, సివిల్ సప్లయ్ అధికారులు పాల్గొన్నారు.

ఖాతాదారుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలి

బ్యాంకు అధికారులు, సిబ్బంది ఖాతాదారుల పట్ల మర్యాదగా పరావర్తించాలని కలెక్టర్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో శివ్వంపేట ఎంపీపీ కల్లూరు హరికృష్ణ, తహసీల్దార్ శ్రీనివాసచారి, శివ్వంపేట ఇండియన్ బ్యాంక్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. సిబ్బంది తీరుపై ఫిర్యాదులు వస్తున్నట్లు తెలిపారు. రైతుల రుణాల రెన్యువల్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలన్నారు. రుణాలు ఇవ్వడంలో ఏదైనా సమస్యలు తలెత్తితే వెంటనే సంబంధిత రెవెన్యూ సిబ్బందితో సమన్వయం చేసుకొని పరిష్కరించాలన్నారు.

మా సమస్యలు పరిష్కరించాలి

'ఈ పంచాయతీ' ఆపరేటర్లు



వంటా-వార్పుతో నిరసన తెలుపుతున్న ఆపరేటర్లు

మెదక్ కలెక్టరేట్: గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్న తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని 'ఈ పంచాయతీ' ఆపరేటర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం వంటా-వార్పుతో నిరసన తెలిపారు. క్రమబద్ధీకరణ లక్ష్యంగా వారం రోజులుగా మెదక్ కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద సమ్మె కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా ఆపరేటర్లు వంటా-వార్పు, సహపంక్తి భోజనాలు చేసి నిరసన తెలిపారు. వీరికి పంచాయతీ కార్యదర్శులు సంఘీభావం తెలిపి రూ.10 వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు జంగం నాగేష్ మాట్లాడుతూ ఆపరేటర్ల సమస్యలను లేఖ రూపంలో ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు విజయ్ పాల్ రెడ్డి, నరేష్ కుమార్, వెంకటేష్, చంద్రహాస్, నర్సింహా రెడ్డి, శ్రీధర్, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ చంద్రశేఖర్ గౌడ్, అధ్యక్షుడు సాయి కుమార్, ప్రధాన కార్యదర్శి చీల హరీష్ కుమార్, ముఖ్య సలహాదారు నామ లక్ష్మణ్, కోశాధికారి రామస్వామి, ఉపాధ్యక్షుడు వెంకటేష్, మహిళా ఉపాధ్యక్షురాలు ప్రతిభా రెడ్డి, శ్రావణి, అశ్విని, సంధ్య, నరేందర్ గౌడ్, కిరణ్, శ్రీనివాస్, మహిపాల్, సురేష్, శ్రీధర్ వూట్ల రమేశ్ పాల్గొన్నారు.

బాలల సమస్యలపై నివేదిక ఇవ్వండి

గ్రామాల్లో వయస్సుల వారీగా బాలల జాబితా తయారు చేసి వారి సమస్యలపై నివేదిక రూపొందించాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులకు సూచించారు. శుక్రవారం రాత్రి ఆయా శాఖల అధికారులతో బాలల రక్షణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో బాలల రక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఏం చేయాలన్న ప్రణాళికను ముందుగానే సిద్ధం చేసుకోవాలని తెలిపారు. కుటుంబ పరిస్థితుల కారణంగా చదువు మానేసే అవకాశం ఉన్న బాలలు, బాల్య వివాహాలు జరిగే ఆస్కారం ఉన్న కుటుంబాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఆదేశించారు. బాల్యవివాహాలు, పిల్లలను పనిలోకి పంపడం వల్ల ఎదురయ్యే అనర్థాలను తల్లిదండ్రులకు, యజమానులకు అర్థమయ్యేలా చెప్పి వారిలో మార్పు తీసుకురావాలన్నారు. బాలలపై ఎలాంటి ఉల్లంఘనలు జరిగినా వెంటనే చైల్డ్ లైన్-1098, పోలీస్-100, డీసీపీఓకు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. బాలికలపై లైంగిక వేధింపులు జరిగితే భరోసా హెల్ప్ లైన్ సెంటర్ నంబర్ 040-27852520, షీ-టీమ్స్ వాట్సాప్ నంబర్ 9490616555, 181కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని ఆయాశాఖల అధికారులు, బాలల రక్షణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

12న యోగా సెలెక్షన్లు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పాఠశాల క్రీడా సమాఖ్య సిద్దిపేట జిల్లా ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా యోగా సెలెక్షన్లు నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ కార్యదర్శి పన్యాల రామేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12న జిల్లా కేంద్రంలోని టీటీసీ భవన్‌లో అండర్ 14, 17 బాలబాలికలకు సెలక్షన్లు ఉంటాయని తెలిపారు.

9 ట్రాక్టర్ల పట్టివేత

మెదక్ మున్సిపాలిటీ: పట్టణ శివారులోని హల్దీ వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న 9 ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు సీఐ వెంకట్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మహిళ అదృశ్యం


మంజుల (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: కూలీ పనికి వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ మోహన్ తెలిపిన వివరాలు. మండల పరిధి రుద్రారం గ్రామానికి చెందిన మంజుల కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తుంది. ఈనెల 3న పనికి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. భర్త బక్కయ్య శుక్రవారం ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అసభ్యంగా ప్రవర్తించాడని..


పోలీసుల అదుపులో యువకుడు

చేగుంట(తూప్రాన్): బ్యాంకులో మహిళల పట్ల అసభ్యంగా వ్యవహరించిన ఓ యువకుడిని పోలీసులకు అప్పగించిన సంఘటన చేగుంటలో శుక్రవారం చోటు చేసుకుంది. చేగుంట శివారులోని ఓ ప్రైవేటు పరిశ్రమలో పనిచేసే బిహార్‌కు చెందిన యువకుడు స్థానిక ఎస్‌బీఐ బ్యాంకుకు వచ్చాడు. మద్యం సేవించి ఉన్న అతను మహిళల వరుసలో నిలబడి వారిపట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. వినియోగదారులు పోలీసులకు సమాచారం అందించడంతో అతను పారిపోవడానికి ప్రయత్నించాడు. యువకుడిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

బీఆర్ఎస్‌లో చేరిన పోతరాజ్ రమణ


బీఆర్ఎస్‌లో చేరిన పోతరాజ్ రమణ

చిన్నశంకరంపేట(మెదక్): మంత్రి కేటీఆర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ చిన్నశంకరంపేట మండల సీనియర్ నాయకుడు పోతరాజ్ రమణ బీఆర్ఎస్‌లో చేరారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో మెదక్ డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో ఆయనతోపాటు పట్టణ అధ్యక్షుడు సుంకరి వెంకట్‌గౌడ్, సూరారం స్వామి, చందంపేట దాస్ గులాబీ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పట్లోరి రాజు, కుమార్‌గౌడ్ ఉన్నారు.

వలస మాని.. వలలు పట్టి

- మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రోత్సాహం
- జిల్లావ్యాప్తంగా 213 సంఘాలు
- అదనంగా 15 సంఘాల ఏర్పాటు
- కొత్తగా సభ్యత్వానికి 3750 మందికి పరీక్షలు
- జిల్లాకు 3కోట్ల 60లక్షల చేపపిల్లలు మంజూరు
- ఇప్పటికే కోటి ఐదు లక్షలు పంపిణీ

హత్నూర (సంగారెడ్డి): గ్రామాల్లో కనుమరుగవుతున్న కులవృత్తులకు పూర్వ వైభవం తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పథకాలకు శ్రీకారం చుట్టి విజయవంతంగా అమలుచేస్తుంది. ఒకప్పుడు బతుకు దెరువు కోసం వలస వెళ్లిన కుటుంబాలు.. నేడు సొంత గ్రామాలకు చేరుకుని తమ కులవృత్తులను చేపడుతున్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత మత్స్యకారుల సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలు అద్భుత ఫలితాలు సాధిస్తున్నాయి. దీంతో వారు తిరిగి కులవృత్తిపై ఆసక్తి చూపుతున్నారు. సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 1071 చెరువులు, కుంటలు ఉన్నాయి. అందులో 3 చిన్న రిజర్వాయర్లు, 30 పెరనీయల్ ట్యాంకులు ఉన్నాయి. మొత్తం 213 మత్స్య సహకార సంఘాలు కొనసాగుతున్నాయి. అందులో 10,465 మంది సభ్యులు ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నూతన సభ్యత్వ నమోదు ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఇందుకోసం వృత్తి నైపుణ్య పరీక్షలు అధికారులు చేపట్టారు. అందులో 3756 మందికి వృత్తి నైపుణ్య పరీక్షలు నిర్వహించగా 600 మంది సభ్యులకు నూతన సభ్యత్వాలు అందజేశారు. అదేవిధంగా మరో 2300 మంది సభ్యులు త్వరలో నూతన సంఘాలలో చేరనున్నారు. జిల్లా వ్యాప్తంగా కొత్తగా 15 మత్స్య సహకార సంఘాలను అధికారులు ఏర్పాటు చేశారు.

ఐదు రకాల వృత్తి నైపుణ్య పరీక్షలు

మత్స్య సహకార సంఘాల్లో కొత్తగా చేరాలంటే ఐదు రకాల వృత్తి నైపుణ్య పరీక్షల్లో నెగ్గాల్సి ఉంటుంది. అందులో భాగంగా ఈత కొట్టడం, వల విసరడం, తెప్పపై వెళ్లడం, పాండి వల లాగడం, వల అల్లడం పరీక్షల్లో నెగ్గాల్సి ఉంటుంది. వర్షాధార చెరువుల పరిధిలో కొనసాగుతున్న మత్స్య సహకార సంఘాల్లో చేరడానికి మూడు రకాల వృత్తి నైపుణ్య పరీక్షలు ఎదుర్కోవాల్సి ఉంటుంది.

సభ్యులకు ప్రభుత్వ పథకాలు

మత్స్య సహకార సంఘంలో సభ్యత్వం ఉన్నవారు ప్రభుత్వ పథకాలకు అర్హులవుతారు. ఆటోలు, వలలు, పనిముట్లు, ఐస్ బాక్సులు, టాటా ఏస్ ఆటోలు, బైక్‌లు సబ్సిడీపై పొందవచ్చు. కొత్తగా చెరువులు, కుంటలు తవ్వుకోవడానికి అవకాశం ఉంటుంది. ప్రమాదవశాత్తు మత్స్యకారుడు మృతి చెందితే వారి కుటుంబానికి రూ.5 లక్షల బీమా అందుతుంది.


చేప పిల్లలను వదులుతున్న చిట్టి దేవేందర్‌రెడ్డి

చెరువుల్లో చేప పిల్లలు

జిల్లాలో 3 కోట్ల 62లక్షల చేప పిల్లలు వదిలేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు ఇప్పటివరకు ప్రభుత్వం పంపిణీ చేసిన ఒక కోటి ఐదు లక్షల చేప పిల్లలను చెరువులో కుంటలో వదిలారు. మిగిలిన వాటిని త్వరలో జిల్లాలోని చెరువుల కుంటలలో వదలనున్నట్లు మత్స్యశాఖ అధికారులు తెలిపారు.

"సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం అందిస్తున్న పథకాలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి. ఉచిత చేపపిల్లల పంపిణీతో పాటు అనేక రకాల సామగ్రిని ప్రభుత్వం అందిస్తుంది.

– సతీష్, జిల్లా మత్స్యశాఖ అధికారి

కొండపాక బతుకమ్మ చెరువులోకి..

కొండపాక(గజ్వేల్): మత్స్యకారుల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని డీసీసీబీ చైర్మన్ చిటి దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. కొండపాకలోని బతుకమ్మ చెరువులో మత్స్యశాఖ ఏడీ మల్లేశంతో కలిసి శుక్రవారం ఆయన చేప పిల్లలను వదిలారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మండలంలోని 83 చెరువుల్లో 16లక్షల 39వేల చేప పిల్లలను వదిలినట్లు తెలిపారు. ఎండాకాలంలో చేపలు చనిపోకుండా తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి కాలువల ద్వారా చెరువులకు నీటిని తరలించనున్నట్లు చెప్పారు. మత్స్యకారులకు ప్రభుత్వం సబ్సిడీపై వాహనాలు అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షురాలు చిట్టి మాధురిరెడ్డి, ఎంపీటీసీ అనుసూయ, ఆరుట్ల లక్ష్మి, ఉపసర్పంచ్ ఆరె భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌గౌడ్

అక్కన్నపేట(హుస్నాబాద్): రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో హుస్నాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండాను రెపరెపలాడిస్తామని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం హుస్నాబాద్ పార్టీ కార్యాలయంలో జనగామ, చౌటపల్లి గ్రామాలకు చెందిన 50 మంది యువకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీపై తీవ్రస్థాయిలో వ్యతిరేకత ఉందన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టును ఎప్పటివరకు ప్రారంభిస్తారో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య, సింగిల్ విండో వైస్ చైర్మన్ ఎగ్గిడి ఐలయ్య, చౌటపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు పులికాశి రమేష్ తదితరులు ఉన్నారు.


కాంగ్రెస్‌లో చేరుతున్న యువకులు

నూతన పద్ధతులతో దిగుబడులు


మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు

హుస్నాబాద్‌రూరల్: గిరిజన రైతులు సాగు చేస్తున్న కరీంనగర్ మొక్కజొన్న పంటలను శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు సందర్శించారు. మీర్జాపూర్, భల్లునాయక్ తండాల్లోని పంటలను పరిశీలించి విత్తన రకాలు, సాగు చేసే విధానం, దిగుబడులపై అవగాహన కల్పించారు. వాతావరణానికి అనుగుణంగా ఎరువులు అందిస్తే తెగుళ్ల నుంచి పంటలను కాపాడుకోవచ్చన్నారు. నూతన పద్ధతుల ద్వారా పంటల దిగుబడులు పెరుగుతాయని సూచించారు. ఈ కార్యక్రమంలో భారత మొక్కజొన్న పరిశోధన కేంద్రం లూథియానా శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్ఎల్ జాట్, డాక్టర్ అభిత్‌కుమార్, డాక్టర్ సూబి, డాక్టర్ రాకేష్ దేవాళ్ల, కరీంనగర్ శాస్త్రవేత్తలు మంజులత, ఉషారాణి, పి. మధుకర్‌రావు, ఏఓ నాగరాజు రెడ్డి పాల్గొన్నారు.

భారతి సిమెంట్‌కు విశేష ఆదరణ

టెక్నికల్ సర్వీసెస్ మేనేజర్ సునీల్

గజ్వేల్ : సిమెంట్ రంగంలో భారతి సంస్థకు తిరుగు లేదని ఆ సంస్థ టెక్నికల్ సర్వీసెస్ మేనేజర్ సునీల్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని తిరుమల ట్రేడర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన తాపీ మేస్త్రీల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తమ సంస్థ అల్ట్రాఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్‌ను తెలంగాణలో విడుదల చేయగా మంచి ఫలితాలు వస్తున్నాయని చెప్పారు. దీని ద్వారా నిర్మాణం వేగంగా జరిగి, దృఢంగా ఉంటుందని చెప్పారు. వినియోగదారులకు సాంకేతిక సలహాలను ఉచితంగా అందిస్తామని తెలిపారు. సమావేశంలో మార్కెటింగ్ అధికారి కే.రాజు, డీలర్ రాజేందర్, కంపెనీ ప్రతినిధులు, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేస్త్రీలకు రూ.లక్ష ప్రమాద బీమా పత్రాలను అందజేశారు.


బీమా పత్రాలను అందజేస్తున్న మేనేజర్ సునీల్

సమస్యలు సహనంతో వినాలి

రిటైర్డ్ ఐజీపీ ఆనంద్ వర్ధన్ శుక్ల

సిద్దిపేటకమాన్: కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా ప్రజలకు సేవలందించాలని రిటైర్డ్ ఐజీపీ ఆనంద్ వర్ధన్ శుక్ల సూచించారు. సీపీ ఆదేశానుసారం పోలీసు అధికారులకు కమిషనర్ కార్యాలయంలో సాఫ్ట్ స్కిల్ డెవలప్‌మెంట్‌పై శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ పోలీసు అధికారి ప్రజల సమస్యను సహనంతో విని పరిష్కరించాలని తెలిపారు. పోలీసు స్టేషన్‌లో న్యాయం జరుగుతుందనే నమ్మకం కల్పించాలన్నారు. వాహనాల తనిఖీలలో, నాకా బందీలలో పోలీసులు వ్యవహరించాల్సిన తీరుపై ఆయన వివరించారు. కోపాన్ని అదుపులో పెట్టుకుని, టైమ్ మేనేజ్‌మెంట్ స్కిల్స్‌తో ఒత్తిడిని జయించవచ్చని చెప్పారు. ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవాలన్నారు. అడిషనల్ డీసీపీలు శ్రీనివాసరావు, మల్లారెడ్డి, ఏసీపీలు సురేందర్‌రెడ్డి, ప్రసన్నకుమార్, చంద్రశేఖర్, సీఐలు కృష్ణారెడ్డి, రవికుమార్, భానుప్రకాష్, చేరాలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రిటైర్డ్ ఐజీపీ ఆనంద్ వర్ధన్ శుక్ల

తాగుడుకు బానిసై బలవన్మరణం


స్వామి (ఫైల్)

దౌల్తాబాద్(దుబ్బాక): తాగుడుకు బానిసైన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని దీపాయంపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. శుక్రవారం ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన చిక్కుడు స్వామి(48) ఐదేళ్లుగా మద్యంకు బానిసయ్యాడు. తాగొద్దని భార్యాపిల్లలు చెప్పినా వినిపించుకునేవాడు కాదు. గురువారం కూడా తాగిన స్వామి తన పొలం వద్ద ఉన్న చెట్టుకు ఉరి వేసుకొని మృతి చెందాడు. మృతుడి కొడుకు ప్రదీప్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు

పోషించేవారు లేరని ఆత్మహత్యా యత్నం


తీవ్ర గాయాలతో రామస్వామి

వట్‌పల్లి(అందోల్): తన బాగోగులు చూసుకునేవారెవరూ లేరని మనస్తాపంతో ఓ వ్యక్తి బ్లేడ్‌తో గొంతు కోసుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన జోగిపేట పట్టణంలోని బుడగ జంగాల కాలనీలో జరిగింది. కాలనీకి చెందిన రామస్వామి మూడేళ్ల క్రితం భార్య, కుమారులు చనిపోయారు. కోడలు, మనవరాళ్లు ఉన్నా పట్టించుకోవడంలేదని ఆవేదనకు గురైన రామస్వామి బ్లేడ్‌తో గొంతు కోసుకున్నాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో అతన్ని జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రి, అక్కడి నుంచి సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

విద్యుదాఘాతంతో రైతు మృతి


గూగ్లోత్ బన్యానాయక్ (ఫైల్)

చిలప్‌చెడ్(నర్సాపూర్): విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన చిలప్‌చెడ్ మండలం గన్యా తండాలో చోటు చేసుకుంది. శుక్రవారం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు. తండాకు చెందిన గూగ్లోత్ బన్యానాయక్(52) వ్యవసాయం చేస్తుంటాడు. గురువారం సాయంత్రం పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. స్టార్టర్ పనిచేయకపోవడంతో సరిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి సోదరుడు అంజ్యా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ షేక్‌మహబూబ్ తెలిపారు.

కరెంట్ షాక్‌తో...

సిద్దిపేటరూరల్: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన నారాయణరావుపేట మండలం గుర్రాలగొంది గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాలు గ్రామానికి చెందిన బాలగోని భూమయ్య(63) వ్యవసాయం చేస్తుంటాడు. శుక్రవారం ఉదయం బావివద్దకు వెళ్ళాడు. అక్కడ తేలి ఉన్న కరెంట్ వైర్ భూమయ్య చేతికి తగిలింది. విద్యుత్ షాక్‌తో భూమయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ సుభాష్ తెలిపారు.

చికిత్స పొందుతూ..

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ఓ వ్యక్తి మృతి చెందినట్లు శుక్రవారం ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపారు. వెస్ట్ బెంగాల్‌కు చెందిన బ్యూటీఖాతున్, ఫారుక్ దంపతులు నెలరోజుల క్రితం జగ్గంపేట గ్రామానికి వచ్చి కూలీ పనులు చేసుకుంటున్నారు. బ్యూటీఖాతున్ చెల్లెలి భర్త ఇస్మాయిల్ ముండాల్(26) వారం క్రితం జగ్గంపేటకు వచ్చి వారి వద్దే ఉంటున్నాడు. ఈ నెల 4న సిరిపురంలో పనిచేసి వచ్చి రాత్రి పడుకున్నాడు ఉదయం అతను ఎంతకూ లేవకపోవడంతో సంగారెడ్డి ఆస్పత్రికి, అక్కడి నుంచి నగరంలోని ఉస్మానియాకు తీసుకు వచ్చారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి..


మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణంలో గురువారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం. స్థానిక బీజేపీ కార్యాలయ సమీపంలో ఓ దివ్యాంగుడు భిక్షాటన చేస్తూ జీవనం సాగించేవాడు. గురువారం సాయంత్రం రోడ్డు పక్కన వీల్ చైర్‌లో మృతిచెంది ఉన్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఆహారం సరిగా లేక మృతిచెంది ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి మృతదేహం లభ్యం

పటాన్‌చెరు టౌన్: బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ శివకుమార్ తెలిపిన వివరాలు. రామచంద్రాపురం పరిధిలోని కొల్లూరు ఎగ్జిట్ – 2 ఈదురు నాగులపల్లి వెళ్లే దారిలో గుర్తుతెలియని వృద్ధురాలు(65) మృతిచెంది కనిపించింది. స్థానికుల సమాచారంతో పోలీసులు మృతదేహాన్ని పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యారంగాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యారంగ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం విస్మరిస్తుందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు ఆరోపించారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. మూడేళ్ల నుంచి రూ.51,751 కోట్ల స్కాలర్‌షిప్స్, ఫీజ్ రియింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా సర్కార్ కాలయాపన చేస్తుందన్నారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేస్తామని హామీ ఇచ్చి మరిచిపోయిందన్నారు. గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లకు ఇప్పటికీ పక్కా భవనాలు లేవన్నారు. ఖాళీగా ఉన్న టీచర్, లెక్చరర్, డీఈఓ, ఎంఈఓ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రెడ్డమైన అరవింద్, దాసరి ప్రశాంత్, ఉపాధ్యక్షులు కొండం సంజీవ్, ఆముదాల రంజిత్, సహాయ కార్యదర్శి నాచారం శేఖర్, భాను, హరీష్, నవీన్, స్టాలిన్, ప్రవీణ్, కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగరాజు

హల్దీవాగుపై కుంగిన వంతెన

నిలిచిన వాహనాల రాకపోకలు

తూప్రాన్: పట్టణ సమీపంలోని గుండ్రెడ్డిపల్లి గ్రామానికి వెళ్లే దారిలో హల్దీవాగుపై నిర్మించిన వంతెన కుంగింది. దీంతో గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వివరాలు ఇలా ఉన్నాయి. హల్దీవాగుపై పదేళ్ల క్రితం నిర్మించిన వంతెన పై నుంచి గుండ్రెడ్డిపల్లి గ్రామం మీదుగా గౌడిగుడెం, దతార్‌పల్లి, మల్కాపూర్ తదితర పది గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. కాగా, శుక్రవారం ఓ భారీ వాహనం వెళ్తున్న క్రమంలో వంతెన కుంగింది. ఆ సమయంలో ఎవరూ అటు వెళ్లకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. అనంతరం జేసీబీ యంత్రంతో వంతెనను సరి చేశారు. కానీ బైకులు తప్ప మిగతా వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే శాశ్వత మరమ్మతు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరారు.


వంతెనకు మరమ్మతులు చేస్తున్న స్థానికులు

9న ఐటీ హబ్‌లో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

సిద్దిపేటఅర్బన్: పట్టణ శివారులోని ఐటీ హబ్‌లో ఈ నెల 9న టామ్‌కామ్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో విదేశాల్లో ఉద్యోగ అవకాశాలకు సంబంధించి ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఏజెన్సీ హెచ్ఆర్ మేనేజర్ శ్రావణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూఏఈ, ఆస్ట్రేలియా, మాల్టా, మారిషస్, జపాన్, జర్మనీ దేశాలలోని ఖాళీ ఉద్యోగాల కోసం అభ్యర్థులను ఎంపిక చేయడానికి ఈ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన వారు రెజ్యూమ్, సంబంధిత డాక్యుమెంట్స్ తీసుకుని హాజరుకావాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు www.otmcom.teanfana.gov.in వెబ్‌సైట్‌లో చూడాలని, లేదా 8247838789, 7893566493, 9849639539 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

శ్రీవారి సేవలో పద్మావతి భజన మండలి

హుస్నాబాద్: తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార సమితి పిలుపు మేరకు పట్టణానికి చెందిన పద్మావతి భజన మండలి సభ్యులు శ్రీ వారి సేవలో తరించిపోయారు. శుక్రవారం తిరుమలలోని అఖండ హరినామస్మరణ మందిరంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు. రెండు గంటల పాటు సభ్యులు ఆలపించిన భజనలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సభ్యులు దొడ్డి లక్ష్మి, మాశెట్టి రాణి, కొత్తపల్లి సరిత, జ్యోతి, చంద్రకళ, జయ, నాగారాణి, పూదరి లక్ష్మి, వాల సుప్రజ, విజయ తదితరులు ఉన్నారు.


తిరుమలలో భజన చేస్తున్న మహిళలు

గృహలక్ష్మి పథకం.. పేదలకు వరం

కొండపాక(గజ్వేల్): గృహలక్ష్మి పథకంతో పేదలకు సొంతింటి కల సాకారం అవుతుందని ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ ఆశాభావం వ్యక్తం చేశారు. కుకునూరుపల్లి మండలం తిప్పారం గ్రామ పంచాయతీ వద్ద 105 మంది లబ్ధిదారులకు గృహలక్ష్మి పథకం మంజూరు పత్రాలను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబుల్ బెడ్రూంలలో లబ్ధి పొందని వారందరికీ విడతల వారీగా గృహలక్ష్మి పథకం అమలయ్యేలా చూస్తామని చెప్పారు. గ్రామాభివృద్ధికి బీసీబంధు, గృహలక్ష్మి పథకాలు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో గ్రామాధ్యక్షులు కోరె చరణ్, నాయకులు ఈరుసాల కరుణాకర్, కార్యదర్శి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.